# సోబతి మా సెడ్డది

**-కనపర్తి రాజశేఖరమ్**

**పో**రడు దుడ్డెకొక్కోలే దుంద్రకుదుంద్ర మంచిగుండేది. శాగవారిన జిబ్రేగు మొద్దోలే గట్టిగ దిట్టగుండేది. దిబ్బ దిబ్బ నడ్సుకుంట పోతుంటే భూమ్మీద దిమ్మిసతోని గుద్దినట్లుండేది. తిండికాడికత్తే రోజుకు మూడుసార్ల కంకెడ్కంకెడు బువ్వ తినుకుంట నూనె ముంతలెక్క నిగనిగ మెర్సెటోడు. ఆని కండల్జూసి ఆని సోబతోల్లంత ఎచ్చుల పోరగాండ్లు ఆన్నంత నల్లసరం గుండని ఎడ్డిత్తురు. పోరడు ఆల్లమాటలకు ఎగురకపొయ్యేది దునుకకపొయ్యేది నిమ్మలంగుండేది.

ఆనీడు పోరగాండ్లంత ఆని సోబతోల్లంత దుబాయ్‌కి పొయ్యొచ్చి పెద్దిరికాలు జేత్తుంటే ఆల్లనే చూసుకుంట బీరిపొయ్యేది. పొద్దుపొద్దంతా దుబాయ్ ముచ్చట్లతోనే గడిపేది. ఆ పోరగాండ్లతోనే లొల్లిలొల్లి వుండేది. ఆల్లు సెప్పే సెప్పుడుకు దుబాయ్ పోవాలని పోరనికి మనసుల వడ్డది. ఆల్లముచ్చటే ఆని మనసులకు బాగా ఎక్కింది. ఏ పని చెయ్యబుద్దైతలేదు. ఎటూ మనసున పడుతలేదు.

ఓరోజు ఇంట్లో అందరుగల్సి గుడాలు బుక్కుకుంట కల్లుబొట్టు తాగుతుండ్రు. అందరి ముంగట కొంచెం ఆల్లని ఉబ్బిచ్చి దుబాయ్‌కి పొయ్యే ముచ్చట ఎల్లగక్కిండు. ఆడన్నమాటలకు ముందుగాల కసురుకున్నరు. ఆని పెండ్లానికి మాత్రం సుతారం ఇష్టంలేదు. ఎముడాల్రాజన్నకు, కొమ్రెల్లి మల్లన్నకు మొక్కంగ మొక్కంగ పుట్టినోడాయే. ఆని సంబ్రం కాదనక ఎకురం గుడ్డం అమ్ముకొని దుబాయ్‌కి పొమ్మని అల్గిపన్నోనికి నచ్చజెప్పరి ఎన్కసీరి. కాయితాలు, పైసలు పట్టుకొని సోబతోల్లతోని కల్సి పొయ్యి దుబాయ్‌లో పడ్డడు.

నెలాయె, రెన్నెల్లాయె నెలెన్కనెల దాటుకుంట దగ్గర్దగ్గర యాడాదికచ్చింది. అయ్యన్మర్సే అవ్వన్మర్సే ఆల్నిమర్సే అందర్నిమర్సే జాడలేదు జాబులేదు ఆడెట్లున్న సంగతి ఎవ్వల్కి తెల్వదు. రోజులు గడుత్తనకొద్ది ఆని పెండ్లానికి దుఃఖమాగుతలేదు. గుడ్ల నీళ్ళు గుడ్ల కుక్కుకొని ఓ చావు చత్తుంది అది ఉచ్చిలిపోరైతే ఊడ పీక్కొని పొయ్యేది. ఇగురంగల్లదిగన్కనే ఇల్లు పట్టుకొనుంది. దుబాయ్‌లో గన్నేండ్లున్నట్టేగని ఐదుపైసలు పంపలేదు. ఉన్నదమ్ముకున్నందుకు ఇల్లు గడుత్తలేదు. ఆపోరి జర మంచిదైపటికే ముసలోల్లను చూసుకుంటుంది.

తీర్థానికి పొయ్యినోల్లు తిరిగచ్చినట్లే దుబాయ్ నుంచి రావట్రి పోవట్రి సంబ్రపడవట్రి. పొయ్యేటప్పుడు ఉబ్బిచ్చిన మాటలుత్తవాయే. సూడంగ సూడంగ వల్లివల్లి వక్కలు వక్కలై రోగాల కుప్పై కండ్లకు కనవడె. ఆన్ని చూడంగనే ఆని పెండ్లాం ఆని మీదవడి బోబో అని ఏడ్సి ప్రేమతోని పెయ్యంత పునికి సూసింది. నల్లసరం గుండులెక్క పొయ్యి పీరీలకుచ్చిన కట్టెలెక్క తిరిగచ్చిండు. మనిస లెక్కలు కనవడుత లేవు. చేదగ్గులు దగ్గుకుంట తుప్ప తుప్ప ఊంచుకుంట మూలుక్కుంట మూలమూలతీగుతుండు. కంకెడ్కంకెడు బువ్వతిన్నోడు కవుష్కెడు గంజి తాగతలేదు. దయ్యం గిట్టపట్టిందేమోనని కోడ్ని తింపేసింది. తొక్కుడుగిట్ట పట్టిందేమోనని మీదికెల్లి పైసదింపి మొక్కి ముడ్పుకట్టింది. మైసవ్వకు మొక్కింది బాలవ్వకు మొక్కింది పోశవ్వ తల్లి కొంటెతనం కావచ్చని పొరుదండాలు తీయించింది. దుర్గవ్వకు మొక్కి దుబ్బేగించింది. బైండ్లోన్తోని బొట్టువెట్టిచ్చి జడ్డు మంత్రమేపిచ్చింది. గల్మల కూసోవెట్టి మీదికెల్లి కల్లుబొట్టు తింపి మూడు తొవ్వల కాడ పారవోసింది. నూటొక్క దేవుల్లకు పబ్బతివట్టి జేపెట్టింది. ఏం లాభం లేదు. ఊరోల్లందరు చెప్పంగ చెప్పంగ ఆఖరికి దావఖానకు తీస్కపోయింది.

❖ ❖ ❖

డాక్టర్ దగ్గర్కిపోతే ఉత్తగైతదా? ఉచ్చ పరీచ్చ చేసిండు, నెత్తురు పరీచ్చ చేసిండు, ఎక్సర్ తీసిండు, బాగా చూసిండు, గోలీలు రాసిండు. ఎన్ని గోలీలేసుకున్న ఏం లాభంలేదు. బక్కవడి బొక్కలు తేలి డొల్లడొల్ల అయ్యిండు. సూడచ్చినోల్లంత ముక్కిర్తుండ్రు తలో మాటంటుండ్రు. నెత్తి నోరు కొట్టుకొని దుబాయ్ పోకని చెప్తే ఇనకపాయె. ఉచ్చిలోనికి ఎగిరిచ్చినట్లు సోబతోల్లంత ఎగిరిచ్చిరి. సోబతోల్లు చెయ్యవట్టి ఉరుకులాట ఎక్కువై అందర్ని చెల్పిడ్సిపెట్టి దుబాయ్ ఉరికె. చెర్ల నీళ్ళన్ని పొయ్యి చెరువెన్కవడే. చేసుక తిందామంటే చేతులు మూలవడె. దున్నక బతుకుదామంటే దుక్కి లేకపాయె. కొనుక్కున్నోల్లు కోటీశ్వర్లయిండ్రు అమ్ముకున్నోల్లు అడుక్కుతింటుండ్రు అటుదిర్గిటుదిర్గి ఆకురాలిపోయినట్టు రాలిపాయె. కాలి కూలి బూడిదై గంగలకల్సె. సోబతి నాశనంజేసే. సోబతి ఇల్లు ముంచె. కొందరికి సోబతి ఎంతో మంచిది ఇంకొందరికి సోబతి మా చెడ్డది కూడ.

నల్లసరం గుండుకు "ఎయిడ్స్" రోగమంటుకుందని డాక్టర్ చిట్టీలు చదివితే ఊకోల్లందరికి తెల్సిపాయె.

■